క్లుప్తంగా

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వినతి

ముషీరాబాద్: నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే అశోక్‌నగర్, కవాడిగూడ చౌరస్తాలలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలని వైఎస్ఆర్‌టీపీ ముషీరాబాద్ నియోజకవర్గం కో– ఆర్డినేటర్ ఆకుల ప్రవీణ్ శుక్రవారం నగర అదనపు కమిషనర్ (ట్రాఫిక్) కలిసి వినతి పత్రం అందజేశారు. అశోక్‌నగర్ క్రాస్‌రోడ్ వద్ద ఆర్టీసీ క్రాస్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలు లోయర్ ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ, ఇందిరా వైపు వెళ్లే వాహనాలతో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కవాడిగూడ డివిజన్ చౌరస్తాలో ఉన్న సిగ్నల్స్ వద్ద కూడా నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. ట్రాఫిక్ సిబ్బందిని నియమించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

జేపీ నడ్డాకు సత్కారం



అంబర్‌పేట్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాను బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు ప్రత్యేకంగా కలిసి సత్కరించారు. శుక్రవారం నడ్డాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డబుల్ బెడ్రూం లబ్ధిదారులకు ఇబ్బంది కలిగించొద్దు

ముషీరాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరైన పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేయొద్దని భోలక్‌పూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ కోరారు. శుక్రవారం భోలక్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తు ఫారంలో భర్త పేరు దరఖాస్తు చేస్తే భార్య పేరు ఉన్న ఆధార్‌నెంబర్‌తో డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరయ్యాయని, వీటిని సరి చేయాలని ఎమ్మార్వో, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరిగినా.. సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేదంటే లబ్ధిదారులతో కలిసి ఆయా కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బహుముఖ ప్రతిభాశాలి అడవి బాపిరాజు

చిక్కడపల్లి: కవిగా నవలా కారుడు, పత్రికా సంపాదకుడిగా అడవి బాపిరాజు బహుముఖ ప్రతిభాశాలి అని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళా వేదికలో శుక్రవారం గానసభ నిర్వహణలో శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా అడవి బాపిరాజు సంస్మరణ సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాపిరాజు గొప్ప చిత్రకారుడని ఆయన రచనలకు బొమ్మలు తానే వేసుకునే వారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో మీజాన్ పత్రికా సంపాదకుడిగా ప్రజలను జాగృతం చేసే వ్యాసాలు రాశారని వివరించారు. కళా జనార్దనమూర్తి, పాత్తూరి సుబ్బారావు, కళా పోషకుడు వెంకట్‌రెడ్డి, తోటశ్రీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్వీని విక్టోరియాకు అభినందన

కాచిగూడ: యూరప్ ఖండంలోని సెర్బియా రాజధాని బెల్గ్రేడ్‌లో జరిగిన ఓపెన్ వాటర్ ఫిన్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన క్వీని విక్టోరియా గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్స్ సాధించిన తీరు అద్భుతమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కొనియాడారు. దేశానికి బంగారు పతకం, రజత పతకం సాధించడం పట్ల శుక్రవారం బర్కత్‌పుర తుల్జాభవన్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని గంధం క్వీని విక్టోరియాను ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రపంచ వ్యాప్తంగా 17 దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పోటీపడి భారత దేశం తరపున పాల్గొని పతకాలు గెలుచుకోవడం గొప్ప విషయమన్నారు. క్వీన్ విక్టోరియా ఎందరో మహిళలకు గొప్ప స్ఫూర్తి దాయకమన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి ఆత్మహత్య

అంబర్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం రాత్రి అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాముల బస్తీలో నివసించే శ్రీనివాస్ కుమార్తె శ్రేయ (21) బి ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతుంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె ఉరేసుకుని కనిపించింది. దిగ్భ్రాంతి చెందిన వారు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి.. హడావుడి

ఒకే రోజు 13 చోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- నేడు మరో 15 చోట్ల శంకుస్థాపనలు
- ఎన్నికల కోడ్ వస్తుందనే..



అడిక్‌మెట్‌లో సీవరేజ్ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్ జోన్ బృందం: అధికార బీఆర్ఎస్ పార్టీ ఉరుకులు, పరుగులు తీస్తోంది. ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠా గోపాల్ శుక్రవారం ఒక్కరోజే సుమారు నియోజకవర్గంలోని 13 ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ఔరా అనిపించారు. రూ.1.38 కోట్ల అభివృద్ధి పనులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శంకుస్థాపనలు చేశారు. దీంతో అధికార పార్టీ నేతలు, కార్యకర్తల్లో సందడి నెలకొంది. చిన్న చిన్న గల్లీల్లో ఈ హడావిడి చూసిన ప్రజలకు ముక్కున వేలేసుకున్నారు. ఎన్నికల కోడ్ మరోవారం రోజుల్లో వస్తుందని ప్రచారం జరుగుతుండటంతో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను హడావిడిగా శంకుస్థాపనలు చేసి ఎన్నికల నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. శనివారం కూడా నియోజకవర్గంలో పలు చోట్ల శంకుస్థాపనలకు ఎమ్మెల్యే ప్రణాళికను సిద్ధం చేశారు.



కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- అడిక్‌మెట్ డివిజన్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్ ఎదుట కచ్చామోరీ నాలా, స్ట్రామ్ వాటర్ పైపులైన్ పనులకు రూ.10 లక్షల నిధులను నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.
- అడిక్‌మెట్ డివిజన్‌లోని పద్మాకాలనీలో రూ.14 లక్షలతో సీసీరోడ్డు, గాంధీనగర్ డివిజన్ వై జంక్షన్‌లో రూ.4 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పైపులైన్ పనులకు కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.
- ముషీరాబాద్ డివిజన్‌లోని వైఎస్ఆర్ పార్కు వీధిలో రూ. 6 లక్షలు, బాప్టిస్ట్ చర్చి వీధిలో రూ.11 లక్షలు, బ్రహ్మంగారి గుడి వీధిలో రూ.8 లక్షలు, సాయిరెడ్డి పటేల్ గల్లీలో రూ. 5 లక్షలతో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.
- ఇందిరాపార్కులో రూ.50 లక్షలతో స్కేటింగ్ గ్రౌండ్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ శంకుస్థాపన చేశారు.
- కవాడిగూడ డివిజన్‌లోని ఎల్చిగూడ, జలవాయూ టవర్స్, పూల్‌బాగ్, దేవీప్రసాద్ బాగ్, హుందాబాగ్‌లలో రూ.30 లక్షలతో తాగునీటి, పైపులైన్ పనుల నిర్మాణానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనాయకుడు ముఠా జైసింహ, వివిధ శాఖల అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోల్నాక అశోకనగర్‌లో ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ: సీఎం కేసీఆర్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ లింగంపల్లిలో రూ.20లక్షలతో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను, వీరన్నగుట్ట బస్తీలో రూ.14 లక్షలతో కమ్యూనిటీహాల్ షెడ్డును స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆత్మగౌరవంతో జీవించేలా పేద, మధ్యతరగతి ప్రజల కలలను సాకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎర్ర భీష్మదేవ్, డాక్టర్ బద్దుల శిరీష, ఓంప్రకాష్‌యాదవ్, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, నర్సింగ్ బాబు, మన్నె శ్రీనివాస్ యాదవ్, కృష్ణాగౌడ్, మహేష్, ఎస్. శ్రీశైలం, రమేష్, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, బీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, మల్లికార్జున్, ప్రతిభ, లావణ్య, అరవింద్, శీర్‌సాగర్, హజారిబాబు, సంతోష్, సూరి, ఆనంద్, శంకర్, ఎస్ఎస్ రాము, మురళి తదితరులున్నారు.

నియోజకాభివృద్ధికి ప్రత్యేక కృషి ..

అంబర్‌పేట: నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శుక్రవారం గోల్నాక డివిజన్ అశోకనగర్‌లో రూ.91 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. డ్రైనేజీ, తాగునీరు, సీసీరోడ్డు పనులను ప్రారంభించి సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అధికారులు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ ప్రారంభం

ఎట్టకేలకు అందుబాటులోకి అంబర్‌పేట అగ్నిమాపక కేంద్రం

నల్లకుంట: సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజలకు భద్రత కూడా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ వర్చువల్‌గా అగ్నిమాపక కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన అంబర్‌పేట అగ్నిమాపక కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మా వెంకట్ రెడ్డి, ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ కె. యుగంధర్‌ప్రసాద్, ముషీరాబాద్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ముషీరాబాద్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు పులిజాల గెల్వయ్య పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సిబ్బంది

మంత్రి తలసానికి శుభాకాంక్షల వెల్లువ



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, తదితరులు



మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాస్కులతో..

అంబర్‌పేట: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలు నిరాడంబరంగా జరిగాయి. శుక్రవారం మంత్రి నివాసంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రత్యేకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య పార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్ల ఉప్పలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. అనంతరం మంత్రి మాస్కులు ధరించి ర్యాలీ చేపట్టారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటకృష్ణారావు, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజేంద్రప్రసాద్‌గౌడ్, నాగభూషణం, ఆర్.మోజెస్, ఎం.దామెదర్‌రెడ్డి, పార్కు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సంతోష్‌గౌడ్ తదితరులున్నారు.

8న టీజీపీఏ రాష్ట్ర కమిటీ ఎన్నిక

నల్లకుంట: తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర కమిటీ ఎన్నికలు ఈనెల 8న నిర్వహించనున్నట్లు టీజీపీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు మోత్కూరు యాదయ్య అన్నారు. బందా రామకృష్ణమూర్తి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. శుక్రవారం నల్లకుంటలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం కొనసాగుతున్న కమిటీని ఈనెల 1న రద్దు చేశామన్నారు. టీఎస్‌జీపీఏను టీజీపీఏలో విలీనం చేస్తున్నామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ గురుకులాల పేరెంట్స్‌కు టీజీపీఏలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. నూతన కమిటీ ఎన్నికల తర్వాత నూతన కార్యవర్గ సమావేశాన్ని దిల్‌సుఖ్‌నగర్‌లోని కార్యాలయంలో నిర్వహిస్తామని ప్రకటించారు. గురుకుల పేరెంట్స్ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

63 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

కాచిగూడ: చట్టసభల్లో 63 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు రాష్ట్రంలో బీసీ కుల జన గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో జరిగిన బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల డిమాండ్ల సాధనకు ఈ నెల 15న కాచిగూడ మున్నూరుకాపు భవన్ మ్యాడం అంజయ్యహాల్‌లో రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం 'బీసీ మహాసభ' నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, సుధాకర్, ఎన్.శ్రీనివాస్‌యాదవ్, నందగోపాల్, కృష్ణుడు, వేముల రామకృష్ణ, బాల్‌రాజ్ యాదవ్, సత్తయ్య కురుమ, బట్టు మురళి, జగన్ ముదిరాజ్, బత్తుల కృష్ణ తదితరులున్నారు.

బిహార్ తరహాలో కులగణన జరగాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచకుండా సొంత భవనాలు నిర్మించకుండా అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్ల వద్ద పిల్లలు బ్రేక్‌ఫాస్ట్ ఎలా చేస్తారని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ విమర్శించారు. ఎన్నికల స్టంట్ కోసమే పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ పెట్టారని విమర్శించారు. శుక్రవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బిహార్ తరహాలో తెలంగాణ కూడా కులగణన జరగాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలు తిరగబడతారనే ఉద్దేశంతో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వెల్లడించడం లేదన్నారు. అల్పాహారం పథకం పేరిట ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాన్ని సీఎం కేసీఆర్ చేస్తున్నారన్నారు. సాధన సమితి నాయకులు వీరస్వామి, మహిళా అధ్యక్షురాలు బండారు పద్మావతి, గోషిక స్వప్న, ఆకాష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు తొలి విడతలో మాలలకు అన్యాయం

ముషీరాబాద్: మాల సామాజిక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దళిత బంధు పథకం మొదటి విడతలో తీవ్ర అన్యాయం జరిగిందని ప్రభుత్వం స్పందించి రెండో విడతలో నైనా మాలలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ మాట్లాడుతూ... మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి వంద యూనిట్ల చొప్పున దళితబంధు పథకాన్ని అమలు చేస్తే మాల సామాజిక వర్గంలో 10 మందికి కూడా రాకపోవడం బాధాకరమన్నారు. నగరంలో మాల భవనం కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించి భాగ్యరెడ్డి వర్మ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వర్కింగ్ చైర్మన్ తాళ్లపల్లి రవి, వినోద్‌కుమార్, కన్వీనర్ నల్లాల కనకరాజు శోభావెంకటేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

బతుకమ్మ చీరల పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రతి బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు ఇస్తున్న బహుమతి బతుకమ్మచీరలు అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ముషీరాబాద్ నియోజవర్గ బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం గాంధీనగర్ డివిజన్ జవహర్ నగర్ కమ్యూనిటీహాల్‌లో స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు బతుకమ్మ పండుగను తెలంగాణ వైభవాన్ని చాటేలా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వినయకుమార్, రత్నసాయిచంద్, జైసింహ, రాకేష్‌కుమార్, ముచ్చకుర్తి ప్రభాకర్, సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మీడియా స్వేచ్ఛను హరించడం సరికాదు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలకులు మీడియా స్వేచ్ఛను హరిస్తే ఊరుకోమని పలువురు వక్తలు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వమైనా మీడియా స్వేచ్ఛను హరించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అభిప్రాయపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై జరిగిన దాడులను ఖండిస్తూ.. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ దాడులను నిరసిస్తూ శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్), ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే), తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్(టీబీజేఏ)ల నేతృత్వంలో బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్కు పరిసర ప్రాంతాల్లో జర్నలిస్టులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నిరసన ర్యాలీ చేపట్టారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి, మాజీ ఎడిటర్ ఎస్.వినయ్‌కుమార్, ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, పార్థసారథి, చంద్రశేఖర్, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, జగదీష్, నవీన్, రాజశేఖర్, నిరంజన్ తదితరులతో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

అంబర్‌పేట్: మీడియాపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం శివంరోడ్డులో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. న్యూస్ క్లిక్ పత్రిక కార్యాలయంపై కేంద్ర ప్రభుత్వం అణిచివేత ధోరణిని అవలంబించడం అన్యాయమన్నారు. న్యూస్ క్లిక్ సంస్థపై దాడులు చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, వెంకట్, శివ తదితరులున్నారు.

పేద విద్యార్థులకు ఉచిత వసతికి ఇంటర్వ్యూ

నల్లకుంట: గ్రామీణ నిరుపేద విద్యార్థులకు లక్ష్మీ వేంకటేశ్వర పోలాప్రగడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వసతి కల్పించనున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ పోలాప్రగడ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం నల్లకుంటలోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చదువుకోవాలనే పట్టుదల ఉన్న గ్రామీణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వసతిగృహంలో నివాసం, భోజనం ఏర్పాటుతో పాటు బస్‌పాస్ తదితర సౌకర్యాలను సమకూరుస్తున్నామన్నారు. ప్రొఫెషనల్, గ్రాడ్యుయేషన్ కోర్సులు అభ్యసిస్తున్న వారికి అవకాశం ఉంటుందన్నారు. తల్లి లేదా తండ్రిని కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అమీనాపూర్, సన్‌సిటీ, మేడిపల్లి, ఘటకేసర్, సుచిత్ర, దమ్మాయిగూడ ప్రాంతాల్లో వసతి గృహాలు ఉన్నాయన్నారు. వసతి గృహాల్లో ఉచిత అడ్మిషన్ల కోసం ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 8న నల్లకుంట శంకరమఠం మార్కెట్ సమీపంలోని ఎస్ఎల్ డయగ్నొస్టిక్ సెంటర్ ఆవరణలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9550472190.

క్రమశిక్షణతో కృషి చేస్తేనే లక్ష్యసాధన సులభం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు అనుకున్న లక్ష్యసాధన కోసం సమయపాలన, క్రమశిక్షణతో కృషిచేస్తేనే విజయం సాధిస్తారని ప్రముఖ మానసిక వికాస నిపుణులు గంప నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో న్యూ ఏరా జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గంప నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. టీనేజీ వయస్సులో విద్యార్థులు చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకూడదని సూచించారు. స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, మనకంటూ లక్ష్యం లేకపోతే ఇతరుల కోసం పని చేయాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఉపాధి పొందడం కాదు, ఉపాధి అందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గంప నాగేశ్వర్‌రావు

వడ్డె ఓబన్నకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధులు ఎంతో మంది ఉన్నారని అందులో వడ్డె ఓబన్న ఒకరని వడ్డెర ఆత్మగౌరవ సముదాయ ట్రస్ట్ తెలంగాణ వైస్ చైర్మన్ ఎత్తరి అంతయ్య అన్నారు. గెరిల్లా యుద్ధ విధానాలను అనుసరిస్తూ.. బ్రిటిష్ వారిని గడగడలాడించి అమరుడైన గొప్ప యోధుడు ఓబన్న అని కొనియాడారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో వడ్డెరుల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ తెలంగాణ ఆధ్వర్యంలో వడె ఓబన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడు ఎనమల శ్రీరాములు, ట్రస్ట్ డైరెక్టర్ ఓర్సు కృష్ణయ్య, మక్కల వెంకటేష్, బండారు శ్రీరాములు, ఎత్తరి మోహన్, శ్రీకాంత్, అనంతరావు, పల్లపు గణేష్ తదితరులున్నారు.

పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యం

ముషీరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు వారిలో పోషకాహార లోపాన్ని నివారించేందుకే సీఎం కేసీఆర్ అల్పాహార పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకాన్ని జీహెచ్ఎంసీ జాయింట్ కమిషనర్ సంధ్య, డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ఏఎంఓహెచ్ డాక్టర్ మైత్రేయి, ముషీరాబాద్ జోన్ విద్యాశాఖ అధికారి చిరంజీవిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్పాహారాన్ని ఎమ్మెల్యే స్వయంగా వడ్డించి తినిపించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అల్పాహార పథకాన్ని సుమారు రూ.20 లక్షల మంది విద్యార్థులకు ప్రవేశపెట్టారని కొనియాడారు. స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచడం పౌష్టికాహార లోపాన్ని నివారించడం, ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్, శివముదిరాజ్, సుధాకర్‌గుప్తా, శంకర్‌ముదిరాజ్, బల్లా ప్రశాంత్, ప్రధానోపాధ్యాయులు నరేందర్‌యాదవ్, డిప్యూటీ ఐఓఎస్‌లు స్వరూపరాణి, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.



విద్యార్థులకు అల్పాహారాన్ని తినిపిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఆరోగ్య పౌరులుగా ఎదిగేందుకు కృషి ..

అంబర్‌పేట్: నేటి బాలలే రేపటి ఆరోగ్య పౌరులుగా ఎదిగేందుకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన బ్రేక్‌ఫాస్ట్ పథకం దోహదపడుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం అల్పాహారం అందించడం పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన ఈ పథకంలో గోల్నాక డివిజన్ లంక ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయకుమార్‌గౌడ్, పద్మావెంకట్‌రెడ్డి అధికారులతో కలిసి ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. వివిధ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోల్నాక లంక బస్తీలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు